ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
గురువారం 03 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:17



## పత్తి పంటలో అంతర పంటల సాగు, సమగ్ర సస్యరక్షణపై అవగాహన

**మంథని, సెప్టెంబర్ 02 (ప్రజాజ్యోతి) :**

మంథని మండలం ఉప్పట్ల గ్రామంలో పత్తి పంటలో అంతర పంటల సాగు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వ్యవసాయ అధికారులు పద్ధతి ప్రదర్శన నిర్వహించారు.

మిగతా 2 లో

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలి

## - ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





**వేములవాడ,సెప్టెంబర్,02:ప్రజాజ్యోతి.**

ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను పరిశీలించిన దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హనుమంతరావు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష

శ్రీ రాజరాజేశ్వర స్వామి (రాజన్న) ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హనుమంతరావు,

మిగతా 2 లో



# ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

## - 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి..

## - పెద్దపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా

2 లో

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ, వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ప్రతి పనిని పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. 80 ఫీట్ల రోడ్డు విస్తరణ, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులపై ఆరా తీశారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వికారాలు తెలుసుకున్నారు.ఆగమ శాస్త్రానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధి చేపట్టడంతో పాటు ఇటీవల శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు విధుశేఖర భారతి స్వామివారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అదనపు వసతులు, ఇతర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు.అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇప్పటికే మంజూరై, టెండర్లు పూర్తయిన పనులతో పాటు తాజాగా మంజూరైన రూ.99.40 కోట్ల పనులపై చర్చించారని,. ప్రతి పనికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు.సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో మరో సమావేశం నిర్వహించి, తదుపరి టెండర్ ప్రక్రియకు వెళ్లాలని నిర్ణయించామని, టెండర్లు పూర్తయిన అనంతరం మరోసారి సమావేశమై రాజన్న ఆలయ అభివృద్ధి పనులను ఎప్పటిలోగా పూర్తి చేయాలనే లక్ష్య తేదీని ఖరారు చేయనున్నామని వివరించారు.. పనులను డే అండ్ నైట్ కొనసాగిస్తూ వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశామని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనుల పురోగతిని సమీక్షించడం, ప్రతి నెలా ఒకసారి క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష సమీక్ష సమావేశం నిర్వహించడం ద్వారా పనులను నిరంతరం పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. తెలంగాణలోని ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించగా, ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.పేదల పెన్నిధిగా, భక్తుల కొంగుబంగారంగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టివేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హనుమంతరావు తెలిపారు.దాదాపు 3 నుంచి 4 గంటల పాటు రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల పురోగతి, నాణ్యత, భవిష్యత్‌లో చేపట్టాల్సిన మార్పులు, మౌలిక వసతులపై చర్చించామని తెలిపారు.ప్రస్తుతం రూ.76 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, అలాగే రూ.35 కోట్లతో అన్నదాన సత్రం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు రూ.99.40 కోట్లతో చేపట్టాల్సిన పనులు టెండర్ దశలో ఉన్నాయని, వాటికి నిర్దిష్ట గడువులు విధించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఆలయ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతులు, కళాకృతులు, నిర్మాణాలపై చర్చించామని వివరించారు. బద్ది పోచమ్మ ఆలయం తదితర అభివృద్ధి అంశాలపై కూడా చర్చించామని తెలిపారు. ఈ అంశాలపై హైదరాబాద్‌లో మరోసారి అన్ని శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు సమక్షంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటీఏడీ ఏ వైస్ చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రతి శుక్రవారం కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవసరమైన జీవోలు, ఉత్తర్వులు తీసుకురావడంలో చొరవ చూపుతున్నారని తెలిపారు.భవిష్యత్‌లో వేములవాడ రాజన్న ఆలయం అద్భుతమైన కళాఖండంగా, దివ్యక్షేత్రంగా రూపుదిద్దుకోనుందని అన్నారు. ఆలయ పరిసరాల్లో విశాలమైన ప్రదేశాలు, ఓపెన్ యాంఫిథియేటర్లు, పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాలకు అనువైన వసతులు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.సుమారు రూ.12 కోట్లతో గుడి చెరువు బండ్ పార్క్ లో ఆదిశివుడి ప్రతిమ వద్ద అభివృద్ధి చేసిన ఆహ్లాదకరమైన వాతావరణానికి ఇప్పటికే రోజుకు సుమారు 2,000 మంది పర్యాటకులు వస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రాతినిధ్యంలో తరతరాలు గుర్తుంచుకునేలా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దేవాదాయ శాఖ తరఫున పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు.చిత్తశుద్ధితో పనులు చేయాలిరాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు సూచించారు. ప్రతి పనిని శ్రద్ధగా.. అందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రాజన్న ఆలయ వైభవం మరింత చాటేలా గొప్పగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా పని చేయాలని ఆదేశించారు. త్వరలో మరో మీటింగ్ పెడతామని వివరించారు.ఉన్నతాధికారుల సూచనల మేరకు..ఉన్నతాధికారుల సూచనల మేరకు రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని వీటీఏడీఏ వైస్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఆలయ పనులపై ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని, దానికి అనుగుణంగా మిగతా పనులు పూర్తి చేయిస్తున్నామని వివరించారు. ప్రతి పనికి గడువు విధించి పూర్తి చేయిస్తున్నామని తెలిపారు.సమీక్ష సమావేశంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ భీమ్లా నాయక్, ఆలయ ఈఈ రాజేష్, తహసీల్దార్ జయంత్ కుమార్, విద్యుత్ శాఖ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య ?

**ఎండపల్లి, సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి**



అప్పుల బాధతో మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎండపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ కథనం మేరకు ఎండపల్లి గ్రామానికి చెందిన బొంగని కిష్టయ్య (79), ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కిష్టయ్య రెండో కుమారుడు సత్తయ్య కొద్ది రోజుల క్రితం గ్రామంలోని కొందరి వద్ద అప్పులు చేసి వెళ్లిపోయాడు. దీంతో ఆ అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళనతో కిష్టయ్య మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటి మెట్ల వద్ద ఉన్న ఇనుప చువ్వకు నైలాన్ తాడుతో ఉరేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి చిన్న కుమారుడు బొంగాని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్గటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మొదటిపేజీ తరువాయి

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:**

ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దపల్లి నియోజకవర్గ కేంద్రంలో మహా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ 420 అడుగుల ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వాటిని అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలతో మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలకు వెయ్యి రోజులు గడిచినా మోక్షం కలగకపోవడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, హామీల అమలు కోసం మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు.ఈ మహా ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పత్తి పంటలో అంతర పంటల సాగు, సమగ్ర సస్యరక్షణపై అవగాహన

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని మిశ్రా పత్తి పంటలో అంతర పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, నేల వనరుల సమర్థ వినియోగం, పంటల వైవిధ్యం, చీడపీడల ఉధృతిని తగ్గించడంలో అంతర పంటల పాత్ర గురించి రైతులకు వివరించారు.మండల వ్యవసాయ అధికారి నవ్య పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) పద్ధతుల ప్రాధాన్యతను వివరించారు. పంటను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ చీడపీడలను ప్రారంభ దశలోనే గుర్తించడం, పసుపు జిగురు అట్టలు, ఫెరోమోన్ ట్రాప్స్ వంటి పద్ధతులను వినియోగించడం, జీవ నియంత్రణ పద్ధతులను పాటించడం ద్వారా పురుగుల ఉధృతిని నియంత్రించవచ్చని తెలిపారు. అవసరమైనప్పుడు మాత్రమే సిఫార్సు చేసిన పురుగు మందులను సరైన మోతాదులో వినియోగించాలని రైతులకు సూచించారు.పత్తి పంటలో చీడపీడల నివారణ, అంతర పంటల సాగు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన పొందారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా పత్తి పంటలో దిగుబడి పెంచడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని అధికారులు సూచించారు. కేవీకే శాస్త్రవేత్త వినోద్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలి

## - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## - వేములవాడలో ఘనంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం





**వేములవాడ,సెప్టెంబర్,02:ప్రజాజ్యోతి.**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు...ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్ పనిచేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మండుటెండల్లో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకం చేసిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, జలయజ్ఞం ద్వారా అనేక సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేసి, పలు రిజర్వాయర్లు, కాలువల నిర్మాణానికి మార్గం సుగమం చేశారని పేర్కొన్నారు.2006లో వేములవాడ నియోజకవర్గంలోని మల్యాల వద్ద జరిగిన ఇందిరమ్మ గ్రామసభకు వైఎస్సార్ హాజరై ఈ ప్రాంత అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎల్ఎండీ ప్రాజెక్టు ద్వారా వరద కాలువ నీటిని మళ్లించి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆనాడే ప్రణాళికలు రూపొందించారని తెలిపారు.పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కూడా వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి లక్షలాది కుటుంబాలకు వైద్య భరోసా కల్పించారని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కూడా వైఎస్సార్ హయాంలో నిధులు కేటాయించారని గుర్తుచేశారు.వైఎస్సార్ మరణం కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి కొనసాగిస్తూ సాగునీటి రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాళేశ్వరం సూరమ్మ ప్రాజెక్టు భూసేకరణకు రూ.80 కోట్లు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.వైఎస్సార్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు.



# కాంగ్రెస్ కార్యాలయంలో వైయస్సార్ - 17 వ వర్ధంతి

**చొప్పదండి, సెప్టెంబర్ 2 (ప్రజాజ్యోతి):**

స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చొప్పదండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, పేదలకు ఉచితంగా వైద్యం అందాలని ఆరోగ్యశ్రీ పథకం,108 అంబులెన్స్ సేవలు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ద్వారా చరిత్ర సృష్టించారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు కేంద్రంలో కూడా అధికారంలోకి రావడానికి ఆయన చేసిన కృషితో కాంగ్రెస్ కార్యకర్తల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో చొప్పదండి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, సింగిల్ విండో వైస్ చైర్మన్ నిజానపురం చందు, మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్, మున్సిపల్ ఫోరం అధ్యక్షుడు గుర్రం సుజీత్ రెడ్డి,కౌన్సిలర్ లు పిట్టల వెంకటేష్, వడ్లూరి అనుష శ్యామ్ సుందర్, కనుమల్ల రాజశేఖర్, సర్పంచులు గన్ను శ్రీనివాస్ రెడ్డి, పెద్దెల్లి సురేష్, చొక్కాల తిరుపతి, లింగాల ఆనంద్ నాయకులు ఎన్నం మనోహర్, గుర్రం రమేష్ గౌడ్, వొళ్ళాల కృష్ణహరీ, నెరుమట్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శిగాముప్పిడి శ్రీధర్

**వేములవాడ,సెప్టెంబర్,2:ప్రజాజ్యోతి.**

వేములవాడ కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి శ్రీధర్ నియమితులయ్యారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగి తం శ్రీనివాస్ ఆశీస్సులతో తన ను పట్టణ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు శ్రీధర్ కృ తజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కాంగ్రెస్ పార్టీ చేపడు తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు అ హర్నిశలు కృషి చేస్తానన్నారు. పార్టీ పెద్దలు తనపై ఉంచిన న మ్మకాన్ని వమ్ము చేయకుండా, కాంగ్రెస్ నాయకులు, తోటి కా ర్యకర్తలతో కలిసి పార్టీ బలోపే తానికి కృషిచేస్తాననితెలిపారు.వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి శక్తివంచన లేకుం డా పనిచేస్తానని ముప్పిడి శ్రీధ ర్ పేర్కొన్నారు.



# వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు

**గంభీరావుపేట సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి):**

గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయులు డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి, కొద్దిసేపు మౌనం పాటిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ముఖ్యంగా రైతుల కోసం ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి సామాన్య ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ బంగ్లా రాజు గౌడ్, ఎండి తాహెర్ మండల కార్యదర్శులు గుర్రం రాజు గౌడ్ టేకుమల్ల ప్రవీణ్, శనిగరపు నరేష్ వర్మ, ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు మల్యాల రాజేశ్వర్ , మండల యువజన నాయకులు గుర్రం రాజు గౌడ్, ఫాక్స్ డైరెక్టర్ రాగుల అంజిరెడ్డి, పార్టీ సోషల్ మీడియా మండల ఇన్చార్జ్ శనిగరపు శంకర్, యువ నాయకులు దేశెట్టి రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు పిట్ల వెంకటి, చెరాల పవన్ గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్,గుడి కాడి కుమార్, మరియు బాలయ్య తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం

**ధర్మారం,సెప్టెంబరు 2 (ప్రజాజ్యోతి):**

ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ ప్రధాన కార్యదర్శి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు,మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం వైఎస్సార్ అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం: 3 ఏళ్ల అద్దె బకాయిలపై ఇంటి యజమాని నిరసన

**వేములవాడ,సెప్టెంబర్,02:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణం లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేయ డంతో బుధవారం ఉద్రిక్తత చో టుచేసుకుంది.
గత మూడేళ్లుగా కార్యాలయా నికి సంబంధించిన నెలకు రూ. 60,000 చొప్పున అద్దె బకాయి లతో పాటు రూ. 2,00,000 క రెంట్ బిల్లు చెల్లించలేదని భవ న యజమాని ఆరోపిస్తున్నారు. బకాయిలు చెల్లించకుండానే ఈ నెల 3వ తేదీన కార్యాలయాన్ని మార్కెట్ యార్డుకు తరలించే దుకు అధికారులు సిద్ధమవు తుండటంపై ఆయన తీవ్ర అ భ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే తమకు రావాల్సిన అద్దె, విద్యుత్ బకాయిలను చెల్లించిన తర్వాతే కార్యాల యాన్ని ఖాళీ చేయాలని డి మాండ్ చేస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేశారు. దీంతో అక్కడికి వచ్చినప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఇంటి యజమాని కోరుతున్నా రు.




# లో-వోల్టేజ్‌తో రైతుల ఆవేదన

- పంటలు ఎండిపోకముందే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి
- బొంపెల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈకి రాగినేడు రైతుల వినతి

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:**



రెక్కల కష్టాన్ని నమ్ముకుని, అప్పుసప్పులు చేసి పంటలు సాగు చేస్తే లో-వోల్టేజ్ సమస్య తమ పాలిట శాపంగా మారిందని రాగినేడు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర హెచ్చుతగ్గులు, లో-వోల్టేజ్ సమస్య నెలకొనడంతో వ్యవసాయ బోరు మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని వాపోయారు. మోటార్లు ఆన్ చేసిన ప్రతిసారీ స్టార్టర్లు ట్రిప్ అవుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రస్తుతం పంటలు ఎదుగుదల దశలో ఉన్నాయని, ఈ సమయంలో నీరు అత్యంత అవసరమని రైతులు పేర్కొన్నారు. విద్యుత్ సక్రమంగా సరఫరా కాకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం గ్రామ సర్పంచ్ సోమ కుమార్ ఆధ్వర్యంలో రైతులు పెద్ద సంఖ్యలో బొంపెల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తరలివెళ్లి అసిస్టెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోమ కుమార్ మాట్లాడుతూ.. పరిస్థితి చేయిదాటి పంటలు ఎండిపోయే వరకు అధికారులు తాత్సారం చేయకుండా వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని కోరారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు నాణ్యమైన, పూర్తిస్థాయి విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించకపోతే గ్రామ రైతులందరినీ కలుపుకుని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు తరాలకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 02 ప్రజా జ్యోతి:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దపల్లి పట్టణంలోని 21వ వార్డ్ శాంతి నగర్ లో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య వార్డ్ ప్రజలకు మొక్కలను అందజేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు తమ తమ ఇండ్లలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని రానున్న భావితరాల వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వాలని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజ్జన్న మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు కావున ప్రతి ఒక్క కౌన్సిలర్లు మీ యొక్క వార్డులలో చెట్లని ప్రతి ఒక్క ఇంటికి అందించి వాటిని సంరక్షించేలా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ కుమార్, నర్సరీ ఇంచార్జ్ సదానందం, మెప్మా ఆర్పీ అజిత, నర్సరీ సిబ్బంది మరియు వార్డ్ మహిళలు పాల్గొన్నారు

# ఘనంగా దుగ్యాల ప్రదీప్‌కుమార్ జన్మదిన వేడుకలు

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:**

భారతీయ జనతా పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్‌కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి రూరల్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో దేవునిపల్లి శ్రీ లక్ష్మీ నంబులాద్రి నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.అనంతరం జెండా చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమంతో పాటు మాతా శిశు ఆసుపత్రిలో పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేల్పుల రమేష్, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాడిన ప్రదీప్‌కుమార్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారని అన్నారు. 1997లో బాసర నుంచి శ్రీశైలం వరకు తెలంగాణ సస్యశ్యామల యాత్ర చేపట్టి రైతులు, విద్యార్థుల సమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రధాన కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా ప్రదీప్‌కుమార్ విజయం సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, మేకల శ్రీనివాస్, పోల్సాని సంపత్‌రావు, కావేటి రాజగోపాల్, ఈర్ల శంకర్, వొల్లె తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, రాజం మహంతి కృష్ణ, సంపత్ శ్రీనివాస్, జాపతి రాజేష్, బొద్దుపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.



## సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి

### - సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు




**సుల్తానాబాద్ సెప్టెంబర్ 2( ప్రజా జ్యోతి)**

గోదావరిఖనిలో అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. బుధవారం పూసల పెద్దమ్మ గుడి వద్ద సుల్తానాబాద్ రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ముత్యంరావు మాట్లాడుతూ.. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను తొలిసారిగా గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా, రాష్ట్రంలోని 34 జిల్లాల్లో కార్మికుల సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ జాతీయ, రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు, ఎన్నికల ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశాలకు ఉద్యోగులు, కార్మికులు, అధికారులు, శ్రేయోభిలాషులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.సమావేశంలో రైస్‌మిల్ ఆపరేటర్స్ సంఘం అధ్యక్షుడు తాండ్ర అంజయ్య, సీఐటీయూ సుల్తానాబాద్ మండల కో-కన్వీనర్ మాతంగి రాజమల్లు, ప్రధాన కార్యదర్శి నౌవుండ్ల బ్రహ్మచారి, బండారి స్వామి, ఎల్లయ్య, రవీందర్, ఓదెలు, రమేష్, లచ్చయ్య, కుమార్, మల్లేష్, సతీష్, విలాస్, శీను, గోపి, శ్రీధర్, సుధాకర్‌రావు, తిలక్, మహేందర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కవితపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు, మహిళా నాయకురాలు కె. కవితపై సోషల్ మీడియాలో అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ కె. అనిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సలెంద్ర కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు.కవితను ఉద్దేశించి ఫేస్‌బుక్, 'ఎక్స్' తదితర సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత పోస్టులు, తెరపట్టులు, లింకులు తదితర ఎలక్ట్రానిక్ ఆధారాలను సేకరించి చట్టప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోరారు. కానిస్టేబుల్‌పై శాఖాపరమైన విచారణ జరిపి, ఆరోపణలు రుజువైతే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మహిళా నాయకురాలు సిరవేణి స్వప్న, బొంకూరి సుభాష్, దేవానంది లక్ష్మయ్య, సీహెచ్. హనుమాన్లు, కలువల రవీందర్, కలువల తిరుపతి, పొన్నాల ప్రవీణ్, నెత్తెట్ల రాజ్‌కుమార్, భూమయ్య, పోసాని కిట్టు తదితరులు పాల్గొన్నారు.







## నీరుకుల్లలో ఎస్ఐఆర్ మిస్మ్యాచింగ్ ప్రక్రియ పూర్తి

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 2( ప్రజా జ్యోతి):**

మండలంలోని నీరుకుల్ల గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల మిస్మ్యాచింగ్‌కు సంబంధించిన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. మిస్మ్యాచింగ్ నమోదైన ఓటర్ల నుంచి అవసరమైన ఆధారాలు, ధ్రువపత్రాలను సేకరించి వివరాలను పరిశీలించారు.తహసీల్దార్ బాసిరుద్దీన్, సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సునీతసాగర్, జీపీఓలు, బీఎల్ఓల సమక్షంలో మిస్మ్యాచింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు సర్పంచ్ కాంపెల్లి సతీష్‌కుమార్ తెలిపారు. ప్రక్రియకు సహకరించిన అధికారులు, బీఎల్ఓలు, గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# సొమ్ము బీజేపీ ది. సోకు కాంగ్రెస్ పార్టీది స్మార్ట్ కార్డు పై ప్రధానమంత్రి ఫోటో పెట్టాలి

## - మాజీ ఎమ్మెల్యే బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు. గుజ్జుల విమర్శ.



**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి)**

రాష్ట్రంలో సొమ్మేమో బిజెపి పార్టీ ది. సోకేమో కాంగ్రెస్ పార్టీది అని మాజీ ఎమ్మెల్యే బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుజ్జుల రామకృష్ణారెడ్డి కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో బుధవారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తీవ్రంగా విమర్శించారు. నెలకు ఒకరికి ఐదు కిలోల చొప్పున బియ్యం కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తే. ఒక్కో కిలో బియ్యం ఇస్తూ గొప్పలు కాంగ్రెస్ పార్టీ గొప్పలుచెప్పుకుంటుందని అన్నారు. స్మార్ట్ కార్డు పై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. బిజెపి పార్టీ కార్యాలయాలు. నల్గొండ జిల్లా అధ్యక్షుడు ఇంటి మీద దాడులు చేయడం సరైనది కాదన్నారు .దాడుల వల్ల ప్రశాంతత దెబ్బతింటుందని దీనితో పార్టీపై చెడ్డ పేరు వస్తుందని హేతు పలికారు. చెక్ డ్యాములుఎందుకు కూలిపోతున్నాయో పరిశీలించా లన్నారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్. పై ఇంజనీర్ పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు .ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి నీళ్లు నింపి రైతులకు నీళ్లు అందించాలన్నారు. పేదల కొరకు నిర్మించిన డబుల్ బెడ్ రూమ్లను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గూడెం జనార్దన్ రెడ్డి .మాజీ వైస్ ఎంపీపీ షకీనాపల్లి శంకరాచారి. బిజెపి పార్టీ నాయకులు ముల్కోజ్ వెంకటేశ్వర్లు. చల్ల చంద్రమౌళి . ఎండి రఫీక్. పురుషోత్తం అనిల్ కుమార్. కొమ్ము లక్ష్మణ్. జంగా రాజన్న .సల్పాల సదయ్య. గుడ్ల నరేష్. రామగిరి మహేందర్. గుడిపాటి మనోహర్ రెడ్డి. శనిగరపు రమేష్ కదారి అశోక్ రావు. ఓర్పుల శ్రీనివాస్ .బీజేపీ పార్టీ నాయకులు. కార్యకర్తలు .తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యార్థికి అంతర్జాతీయ ఫిడే చెస్ ర్యాపిడ్ రేటింగ్

## - క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఉపాధి అవకాశాలు:

## - డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 2( ప్రజాజ్యోతి )**

క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపుతో పాటు భవిష్యత్‌లో అనేక అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో చెస్‌లో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించిన విద్యార్థి కే. స్నితిక్‌రెడ్డిని అభినందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు ఒత్తిడిని తగ్గించడంతో పాటు విద్యార్థులు రోజువారీ కార్యకలాపాలను ఉత్సాహంగా నిర్వహించేందుకు దోహదపడతాయని తెలిపారు. చెస్ క్రీడ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, చక్కటి ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొని వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

క్రీడల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులతో వివిధ క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వివిధ స్థాయిల్లో నిర్వహించే పోటీలకు ఎంపిక చేసి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్–13 జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న కే. స్నితిక్‌రెడ్డి పాల్గొని తన తొలి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించడం అభినందనీయమని



నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థిని అభినందించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# నూకలమర్రిలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళులు

## - వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం: రొమాల ప్రవీణ్

**వేములవాడ,సెప్టెంబర్,02:ప్రజాజ్యోతి.**

వేములవాడ గ్రామీణ మండలం నూకలమర్రి గ్రామంలో యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, వైయస్ రాజశేఖర్ రెడ్డి తన పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఆయన అహర్నిశలు శ్రమించారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఫారం పాండ్ నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 2 (ప్రజాజ్యోతి) :-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో మన్నెంపల్లి గ్రామంలో వి బి జి రాంజీ పథకం కింద ఫారం పాండ్ పనులను ప్రారంభించారు మేడి మంజుల వ్యవసాయ భూముల్లో ఫారం పాండ్ పనులకు శ్రీకారం చుట్టారు రైతులకు నీటి వనరులు అందుబాటులోకి తీసుకురావడం వ్యవసాయానికి మరింత తోడ్పాటు అందించడం లక్ష్యంగా ఈ పనులు చేపట్టడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, వార్డు సభ్యులు జైపాల్ రెడ్డి, సుదగోని పర్శరాములు గౌడ్, దరిపెల్లి రమ్యశ్రీ, బొజ్జ శ్రీనివాస్,సంధి లక్ష్మి,సుదగోని అనూష,పోతుగంటి రమేష్,సొల్లు విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



# మెడికవర్‌లో అరుదైన సూక్ష్మదర్శిని న్యూరో శస్త్రచికిత్స విజయవంతం

- మెదడులో రక్తస్రావం, అన్యురిజంతో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన 60 ఏళ్ల మహిళకు సకాలంలో చికిత్స
- న్యూరో శస్త్రచికిత్స నిపుణుడు డా.రాజీవ్‌రెడ్డి,

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 2 ప్రజా జ్యోతి**

మెదడులో రక్తస్రావంతో పాటు అన్యురిజం కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన 60 ఏళ్ల మహిళకు కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన సూక్ష్మదర్శిని న్యూరో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉండటంతో పాటు తన రోజువారీ పనులను తానే చేసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లికి చెందిన కౌసల్య రోజువారీ పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు తొలుత సమీప ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ మెడికవర్‌కు తీసుకువచ్చారు. అపస్మారక స్థితిలో చేరిన ఆమెకు అత్యవసరంగా సీటీ స్కాన్ నిర్వహించగా మెదడులో రక్తస్రావం ఉన్నట్లు గుర్తించారు. తదుపరి పరీక్షల్లో మెదడులోని రక్తనాళంలో అన్యురిజం ఉన్నట్లు నిర్ధారించారు.రక్తనాళం గోడ బలహీనపడటంతో ఒక ప్రాంతంలో బెలూన్‌లా ఉబ్బే పరిస్థితిని అన్యురిజం అంటారని, అది చిట్లినప్పుడు మెదడులో రక్తస్రావం జరిగి ప్రాణాపాయం ఏర్పడుతుందని వైద్యులు తెలిపారు. కౌసల్య పరిస్థితి అత్యంత సంక్లిష్టంగా ఉండటంతో ఆలస్యం చేస్తే ప్రాణాలతో పాటు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల సమ్మతితో అత్యవసరంగా సూక్ష్మదర్శిని న్యూరో శస్త్రచికిత్స నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించారు.ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య బృందం, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో సకాలంలో చికిత్స అందించగలిగామని వైద్యులు తెలిపారు. కౌసల్య కుమారుడు మహేష్ మాట్లాడుతూ, తల్లి పరిస్థితి చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యామని, అయితే మెడికవర్ వైద్యులు అత్యవసరంగా స్పందించి క్లిష్టమైన




శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించడంతో ప్రస్తుతం ఆమె సాధారణ స్థితికి చేరుకుని తన పనులు తానే చేసుకుంటున్నారని తెలిపారు.ఆస్పత్రి కేంద్ర అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో న్యూరో శస్త్రచికిత్స నిపుణుడు డా. రాజీవ్‌రెడ్డి, మత్తు వైద్య విభాగం అధిపతి డా. వినయ్, అత్యవసర వైద్య విభాగం డా. సత్యనారాయణ, ఆస్పత్రి పర్యవేక్షకురాలు డా. ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## కోనరావుపేట మండల కేంద్రంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

- నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కోనరావుపేట,సెప్టెంబర్ .2 (ప్రజా జ్యోతి)**

మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వర్ధంతి వేడుకలు కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సత్యం, మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, 108, 104 వంటి పథకాలతో ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేసుకున్నారు. వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.అనంతరం పలువురు నాయకులు వైఎస్ఆర్ సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశీరాం, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రాస రవీందర్,ఏఎంసి డైరెక్టర్లు వెంగలి వెంకన్న, ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గొట్టె రుక్మిణి, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రదీప్, వీరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సదానందం ,కళ్యాణ్, మనోజ్, సీనియర్ నాయకులు ,కార్యకర్తలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అప్పన్నపేటలో 1,505 డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

- సర్పంచ్ ఆరె సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:**

అప్పన్నపేట గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు 1,505 డిజిటల్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ ఆరె సంతోష్‌కుమార్ పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు.కార్డుల పంపిణీ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## మర్రివానిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**ఇల్లందకుంట,సెప్టెంబర్02 (ప్రజాజ్యోతి):**

ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లి గ్రామంలో జమ్మికుంట ఆదిత్య, అమృత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ ఆకుల శ్రీనివాస్, న్యూరాలజిస్ట్ డాక్టర్ భరత్, గైనకాలజిస్ట్ డాక్టర్ గ్రీష్మ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి, అవసరమైన మందులను అందజేశారు.గ్రామ సర్పంచ్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ కడారి పద్మ-నవీన్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలకు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపయోగపడేలా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది.





# జనాభానే లేని కులానికి అంగన్‌వాడీ పోస్టు.....!

- గోపాలరావుపేటలో గ్రూప్3 రిజర్వేషన్ కేటాయింపుపై తీవ్ర దుమారం....
- ఒక్క కుటుంబం కూడా లేని పోస్టు కేటాయింపుపై అనుమానాలు....
- రిజర్వేషన్ రోస్టర్ ఖరారులో నిబంధనలు పాటించారా....?
- జనాభా వివరాలు పరిశీలించకుండానే నిర్ణయం తీసుకున్నారా....?- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం.....- అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్




**రామడుగు, సెప్టెంబర్ 02(ప్రజా జ్యోతి):**

గంగాధర ప్రాజెక్టు పరిధిలోని రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టు కేటాయింపు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో గ్రూప్3 కులానికి చెందిన జనాభా లేకపోయినప్పటికీ అదే కేటగిరీకి అంగన్‌వాడీ పోస్టును కేటాయించడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామంలోని సామాజిక వర్గాల వాస్తవ జనాభా పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్నారా..? సంబంధిత రిజర్వేషన్ రోస్టర్‌ను ఏ ప్రాతిపదికన ఖరారు చేశారు..? గ్రామంలో సంబంధిత కేటగిరీకి జనాభా లేకుంటే ఆ పోస్టును అదే వర్గానికి ఎలా కేటాయించారు? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి తీవ్రంగా వినిపిస్తున్నాయి.

### - జనాభా లేని వర్గానికి రిజర్వేషన్.. ఇదేం కేటాయింపు?

అంగన్‌వాడీ పోస్టుల కేటాయింపులో రిజర్వేషన్ అమలు చేస్తున్న క్రమంలో ఆయా గ్రామాల్లోని సామాజిక వర్గాల పరిస్థితి, ప్రభుత్వ నిబంధనలు, రోస్టర్ విధానం తదితర అంశాలు కీలకంగా ఉంటాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే గోపాలరావుపేటలో గ్రూప్3 వర్గానికి చెందిన ప్రజలు లేరని చెబుతున్నప్పటికీ, ఆ వర్గానికి పోస్టు కేటాయించడం ఎలా సాధ్యమైందన్నదే అసలు ప్రశ్న. గ్రామంలో ఆ వర్గానికి జనాభా లేనప్పుడు పోస్టు కేటాయింపునకు ఆధారమైన వివరాలు ఏమిటో అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### - రోస్టర్ ఖరారు వెనుక ప్రాతిపదిక ఏమిటి?

గ్రూప్3 కేటగిరీకి పోస్టును కేటాయించడానికి అధికారులు ఏ రిజర్వేషన్ రోస్టర్‌ను అనుసరించారు? ఆ రోస్టర్‌ను ఖరారు చేసే సమయంలో గ్రామంలోని తాజా జనాభా వివరాలను పరిశీలించారా? లేక పాత రికార్డుల ఆధారంగా నిర్ణయం తీసుకున్నారా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. పోస్టు కేటాయింపులో ఉపయోగించిన జనాభా లెక్కలు, రోస్టర్ వివరాలు, కేటగిరీ నిర్ణయానికి సంబంధించిన రికార్డులను బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### - అర్హులైన వారికి దక్కాల్సిన అవకాశం ఎటు?

రిజర్వేషన్ ద్వారా ప్రయోజనం పొందాల్సిన అర్హులైన వర్గాలకు అవకాశం కల్పించడమే ప్రభుత్వ విధానాల ఉద్దేశమని స్థానికులు పేర్కొంటున్నారు. కానీ గ్రామంలో సంబంధిత వర్గం జనాభానే లేని పరిస్థితిలో ఆ కేటగిరీకి పోస్టు కేటాయిస్తే, వాస్తవంగా రిజర్వేషన్ ప్రయోజనం ఎవరికి దక్కుతుంది? అని ప్రశ్నిస్తున్నారు. అంగన్‌వాడీ పోస్టు కోసం ఎదురుచూస్తున్న అర్హత కలిగిన స్థానిక అభ్యర్థులకు ఈ నిర్ణయం అన్యాయం చేసే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### - కాగితాలపై లెక్కలేనా.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు పట్టవా?

పోస్టుల కేటాయింపులో కేవలం కార్యాలయ రికార్డులు, పాత జనాభా లెక్కలు లేదా ఇతర వివరాలనే ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో వాస్తవంగా ఏ సామాజిక వర్గానికి ఎంతమంది జనాభా ఉన్నారన్న అంశాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారా లేదా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించకుండా రిజర్వేషన్ కేటగిరీని నిర్ణయిస్తే అర్హులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.

### - అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

అంగన్‌వాడీ పోస్టు కేటాయింపులో సంబంధిత అధికారులు తగిన స్థాయిలో పరిశీలన జరిపి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒక గ్రామంలో లేని వర్గానికి చెందిన కేటగిరీకి పోస్టు కేటాయించడం సాధారణ విషయం కాదని, దీనిపై అధికారులు పూర్తి వివరణ ఇవ్వాల్సిందేనని వారు డిమాండ్ చేస్తున్నారు. పోస్టు కేటాయింపునకు ముందు సంబంధిత శాఖ అధికారులు గ్రామస్థాయి వివరాలను పరిశీలించారా? అన్నదానిపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

### - విచారణ జరిపి రిజర్వేషన్ మార్చాలి...



గోపాలరావుపేటలో జరిగిన అంగన్‌వాడీ పోస్టు కేటాయింపుపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి రిజర్వేషన్ మార్చాలని కోరుతున్నారు. గ్రామ జనాభా వివరాలు, కులాల వారీగా ఉన్న జనాభా సమాచారం, రిజర్వేషన్ రోస్టర్, పోస్టు కేటాయింపు ఉత్తర్వులు, అర్హత ప్రమాణాలు తదితర అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు జరిగి ఉంటే వెంటనే దానిని సరిదిద్ది అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### - స్పందించాల్సిన బాధ్యత అధికారులదే ......

ఈ వ్యవహారంపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది. గ్రూప్3 జనాభా లేని గ్రామంలో అదే కేటగిరీకి పోస్టు కేటాయించడానికి కారణమేంటి? ఏ నిబంధన ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు? ఏ జనాభా వివరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రిజర్వేషన్ అనేది అర్హులకు న్యాయం చేయడానికి ఉద్దేశించిన విధానం తప్ప.. అర్హులకు అన్యాయం చేసే విధంగా మారకూడదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గోపాలరావుపేటలోని అంగన్‌వాడీ పోస్టు కేటాయింపు అంశాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# క్షయ, హెచ్ఐవీపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:**

క్షయ, హెచ్ఐవీ నివారణపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ



క్షయ నిర్మూలన కార్యక్రమం, హెచ్ఐవీ నివారణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ లక్షణాలను సకాలంలో గుర్తించి అనుమానితులకు వెంటనే పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి పూర్తి స్థాయిలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.పెద్దపల్లి జిల్లా హెచ్ఐవీ పరంగా అధిక ప్రమాదం ఉన్న జిల్లాగా ఉన్నందున నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవడంలో ఎలాంటి సిగ్గు, సంకోచం అవసరం లేదని, ముందస్తు పరీక్షలతో వ్యాధిని గుర్తించి సకాలంలో వైద్యం పొందవచ్చన్నారు.అధిక ప్రమాద వర్గాలను గుర్తించి వారికి గోప్యతతో పరీక్షలు, కౌన్సెలింగ్, అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. హెచ్ఐవీపై ఉన్న అపోహలు, భయాలను తొలగించేలా శాస్త్రీయ అవగాహన కల్పించాలని సూచించారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పవిత్ర, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రిలో తొలిసారిగా మోకాలి మార్పిడి

# శస్త్రచికిత్స విజయవంతం

## - 67 ఏళ్ల మహిళకు సంపూర్ణ మోకాలి మార్పిడి

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:**



పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో తొలిసారిగా అత్యంత క్లిష్టమైన కుడి మోకాలి సంపూర్ణ మార్పిడి శస్త్రచికిత్స (టోటల్ నీ రీప్లేస్‌మెంట్) విజయవంతంగా నిర్వహించారు. జిల్లాకు చెందిన 67 ఏళ్ల మహిళ గత ఏడాది కాలంగా కుడి మోకాలిలో గ్రేడ్-4 ఆస్టియో ఆర్థరైటిస్‌తో తీవ్రంగా బాధపడుతున్నారు.రోగికి రక్తపోటు, మధుమేహంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం శస్త్రచికిత్స చేపట్టినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్‌కుమార్, అనస్తీషియా వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రామం ఆధ్వర్యంలోని వైద్య బృందం శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. వైద్య బృందంతో పాటు నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ అభినందించారు.జిల్లా ఆసుపత్రిలో లాపరోస్కోపీ, యూరాలజీ, లేజర్ చికిత్సలు, ఫిస్టులా తదితర క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నామని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. జిల్లా ప్రజలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# సోషల్ మీడియాలో కవితక్క పై అసభ్యకర పోస్టులు పెట్టిన కానిస్టేబుల్ పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు



**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 2(ప్రజా జ్యోతి)**

తెలంగాణ రక్షణ పార్టీ (టీ ఆర్ ఎస్ )చీఫ్, అధినేత కల్వకుంట్ల కవితపై సోషల్ మీడియా వేదికగా అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ కె. అనిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ మజీద్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్లారెడ్డిపేట మండల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మజీద్, మహిళా నాయకులు కదిరే రేణుక, ఆకారం పుష్పలత మల్లవ్వ, యువ నాయకుడు జావిద్ మాట్లాడుతూ సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కవితక్క రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పాంచ జన్య సంకల్ప సభ విజయవంతం కావడంతో సభకు వచ్చిన అశేష జనాన్ని చూసి రాజకీయ నాయకులు వారికి వత్తాసు పలుకుతున్న కొంతమంది ఉద్యోగులు కూడా జీర్ణించుకోలేక ఇంస్టాగ్రామ్, ఫేస్‌బుక్, 'ఞ' తదితర సోషల్ మీడియా వేదికల్లో కవితను ఉద్దేశించి అభ్యంతరకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలను ప్రచురించి ప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు. మహిళా నాయకురాలి గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ అనిల్ నిందితుడిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి, జైలుకు పంపి, ఉద్యోగం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు, ఖాతాలు, ఖాతా వివరాలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని, అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. నిందితుడు పోలీస్ శాఖలో పనిచేస్తున్నందున శాఖాపరమైన విచారణ చేపట్టి ఇలాంటి సంఘటనలు జరగకుండా డిజిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ, వివిధ మండలాల నాయకులు కదిరే భాస్కర్ గౌడ్, మార్వాడి దేవరాజు, ఓర్సు అశోక్, శ్రీహరి, అశోక్, భూపతి, బద్రి, పరశురాములు, కొర్రి రమేష్, రాజిరెడ్డి, వినోద్, భాష, సిద్ధూ, అందే పరుశరాములు, బాబు, రాము, సుశాంత్, అనిల్, సురేష్, చందు, కుర్ర సాయి, అనిల్, గౌరీ గారి సతీష్ లు పాల్గొన్నారు.

# బొప్పాపూర్ విద్యార్థులకు షీ టీం అవగాహన కార్యక్రమం

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 2 (ప్రజా జ్యోతి )**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ లోని సిఎంసి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా షీ టీం మహిళా ఉపాధ్యాయులు బాలికలకు జిల్లా పోలీస్ సూపరిండెంట్ మహేష్ బీ గీత సూచనల మేరకు ప్రతిరోజు విద్యాసంస్థలలో మహిళలుగా పనిచేసే ప్రదేశాలలో సందర్శిస్తూ రాగింగు చట్టం వేధింపులపై వగాహన సైబర్ నేరాల పైన సి టీం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు విద్యార్థులు మహిళలు ఎవరైనా వేధింపులకు గురి అయితే షీ టీం నెంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫిర్యాదులు వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచబడతాదని సూచించారు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులు మాట్లాడిన స్పందించకూడదని గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వరాదని వారితో పంచుకోవద్దని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి రమా మనోహర్రావు బాలయ్య సదానందం రమేష్ భరత్ భాస్కర్ రవీందర్ భాస్కర్ రెడ్డి విజయ మంజుల సంధ్యారాణి పద్మ మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.



# 7 వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా కౌన్సిలర్ వూట్ల వరప్రదీప్

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 2: (ప్రజా జ్యోతి)**

సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో విద్యుత్ సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టారు. వార్డులోని శ్యామ్ ఇంటి నుంచి దీపక్ ఇంటి వరకు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, వాటికి సర్వీస్ వైర్లు అమర్చడంతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో విద్యుత్ వెలుగులు అందుబాటులోకి వచ్చాయి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆశీస్సులతో 7వ వార్డు కౌన్సిలర్ వూట్ల వర ప్రదీప్ ఆధ్వర్యంలో ఈ అభివృద్ధి పనులను చేపట్టారు. విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పనులు పూర్తి చేయించారు.నూతన విద్యుత్ స్తంభాలు, సర్వీస్ వైర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు స్థానికులకు భద్రతా భావం కలుగుతుందని కౌన్సిలర్ తెలిపారు. తమ చిరకాల సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని వూట్ల వర ప్రదీప్ పేర్కొన్నారు.



# డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు టాస్క్ పైన అవగాహన కార్యక్రమం..

**గంభీరావుపేట సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి);**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేటలో టాస్క్ అండ్ కెరీర్ గైడ్ అండ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జె శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి అధ్యక్షతన కళాశాలలో రెండు రోజుల శిక్షణ లో భాగంగా మొదటి సంవత్సరం లో చేరిన విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ గా టాస్క్ కరీంనగర్ బ్రాంచ్ రిలేషన్ మేనేజర్ హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ గారు మాట్లాడుతూ టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రెండు రోజుల ప్రోగ్రాంని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(ఏ ఐ), కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్ భాష పైన పట్టు సాధించాలని, ప్రస్తుత డిజిటల్ టెక్నాలజీ కి అనుగుణంగా మార్చుకొని విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా కళాశాలలో విద్యార్థులకు అకాడమిక్ తో పాటు టాస్క్ పైన ఏ కార్యక్రమాన్నైనా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు ప్రతి సంవత్సరం విద్యార్థులకు టాస్క్ పైన ఐదు నుంచి ఆరు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హాజరైన రిసోర్స్ పర్సన్ గంగా ప్రసాద్ మాట్లాడుతూ , టాస్క్ లో జాయిన్ అయిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, కళాశాలలో చదువుతున్నప్పుడే కాకుండా డిగ్రీ పూర్తి అయిన తర్వాత కూడా టాస్క్ విద్యార్థులకు బయట ఉద్యోగాలకు కూడా తగిన ప్రాధాన్యత ఉంటుందనీ, 21 ఎస్టి సెంచరీ ట్రాన్స్ఫరబుల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, జాబ్ ఓరియెంటెడ్ స్కిల్స్, క్యాంపస్ టు కార్పోరేట్,ఫ్రైడ్ మహీంద్రా, ఎంటర్ప్రెన్యూర్షిప్,సాఫ్ట్ స్కిల్ప్,ఎంప్లాయబుల్ స్కిల్స్ ఇలాంటి ప్రోగ్రామ్స్ అన్నీ కుడా టాస్క్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం వలన పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ జె శ్రవణ్ కుమార్ అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్, పాక ధర్మపురి,డాక్టర్ ఆంజనేయులు, వి. వాణి, డాక్టర్ అడివిష్ణు, డాక్టర్ కె. వి. బిక్షమయ్య, మనోహర్,సుచరణ్, కృష్ణ ప్రసాద్, మహేష్, శంకర్,దీపిక, భార్గవి,ఆకల్య తదితరులు పాలుగోన్నారు.

# ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిసిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 2(ప్రజాజ్యోతి)**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డా. వి. నరేందర్‌రెడ్డి ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై ఖర్గేతో నరేందర్‌రెడ్డి చర్చించారు. పార్టీ పటిష్టత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని, ఇవి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయని ఖర్గే పేర్కొన్నట్లు తెలిపారు.అనంతరం కరీంనగర్ జిల్లాలో పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలను నరేందర్‌రెడ్డి వివరించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులతో సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# సర్' నోటీసుల కౌంటర్లను పరిశీలించిన నగరపాలక సంస్థ కమీషనర్



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 2 (ప్రజాజ్యోతి)**

నగరపాలక సంస్థ పరిధిలోని కళాభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'సర్' నోటీసు కౌంటర్లను బుధవారం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీ చేశారు. కౌంటర్ల వద్ద జరుగుతున్న 'సర్' నోటీసుల పరిష్కార తీరు, ఆన్‌లైన్ డేటా నమోదు ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఆ తర్వాత కౌంటర్ల వారీగా బి.ఎల్.ఓలతో మాట్లాడి, నోటీసుల హియరింగ్ ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల వద్దకు వచ్చిన ఓటర్లతో స్వయంగా మాట్లాడి, వారికున్న పలు సందేహాలను నివృత్తి చేశారు. ఓటర్ల వివరాల సవరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బి.ఎల్.ఓలకు పలు సూచనలు చేస్తూ తగిన ఆదేశాలు జారీ చేశారు. నోటీసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి, సత్వరమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.... ఇంకా నోటీసులు అందని ఓటర్లకు వెంటనే బి.ఎల్.ఓలు నోటీసులు అందజేయాలన్నారు. , వారు హియరింగ్‌కు వచ్చారా లేదా అనే విషయాన్ని నిశితంగా పరిశీలించాలన్నారు. హియరింగ్‌కు రాని ఓటర్లకు మరో మారు సమాచారం అందించి తమ నోటీసులను క్లియర్ చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాషనర్లు ఆయాజ్, సువార్త, డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాదవ్, ఎమ్మార్వో రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి పల్లె భూముల రీ సర్వే పనులను పరిశీలన

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్...

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ సర్వేపల్లి రీ సర్వే భూములను అక్కడ చేపడుతున్న పనులను రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పర్యవేక్షించారు అనంతరము మాట్లాడుతూ రీ సర్వే పకడ్బందీగా చేయాలని సర్వే చేపడుతున్న పనుల గురించి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు ఈ విషయం తెలియజేయాలన్నారు నిబంధన మేరకు సర్వే పనులు నిర్వహించాలని ఆదేశించారు. పరిశీలనలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్ నయాప్ తాసిల్దార్ వేణు సర్వేయర్లు తదితరులు ఉన్నారు.



# బొప్పాపూర్ లో ఒంటరి దళిత వృద్ధుడు మృతి

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి)**



ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న మిడిదొడ్డి శంకరయ్య 75 సంవత్సరాలు అనారోగ్యంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు శంకరయ్య వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడని సుమారు మూడు రోజులుగా మంచానికే పరిమితమై ఇంటి నుంచి బయటికి రాకపోవడంతో బుధవారం ఉదయం స్థానికులు అనుమానంతో ఇంటి తలుపులు తెరిచి చూడగా శంకరయ్య మృతి చెందినట్లు గుర్తించారు మృతదేహం కుళ్ళిపోయి ఇంటి నుంచి దుర్వాసన వస్తూ ఉండడంతో ఈ విషయాన్ని తెలుగులోకి వచ్చింది నాన్న వారు లేక ఒంటరి జీవించే వాడని తెలుస్తుంది.

# యుపిఎస్ రాజన్నపేట పాఠశాలలో ఉచిత యూనిఫాం పంపిణీ....

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట యుపిఎస్ పాఠశాలలో ప్రభుత్వము ఇచ్చిన ఉచిత పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు విద్యార్థులకు రాజన్నపేట సర్పంచి కల్లూరు బాపురెడ్డి మాజీ సర్పంచి శంకర్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ గ్రామస్తులు ఉపాధ్యాయులు పాల్గొని పంపిణీ నిర్వహించారు ప్రభుత్వము అందించే సేవలను విద్యార్థులు తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు ఉచిత పాఠ్య పుస్తకాలు మధ్యాహ్న భోజనము స్కాలర్షిప్లు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు



# 1.11 కిలోల గంజాయి పట్టివేత

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 02,(ప్రజాజ్యోతి):**

కరీంనగర్ రూరల్ పోలీసుల తనిఖీల్లో 1.11 కిలోల గంజాయి బుధవారం పట్టుబడింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇరుకుల్ల గ్రామ శివారులో తనిఖీలు చేపట్టగా,గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న వజ్జంగి ప్రేమ్ కుమార్ (28)ను పోలీసులు అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి గంజాయితో పాటు బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.మరో నిందితుడు కాశిపాక నవీన్ (23) పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ప్రేమ్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.




# మల్లన్నపల్లిలో అభివృద్ధి పరుగులు

# రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం





**ఇల్లందకుంట, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి):**

మల్లన్నపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో, మల్లన్నపల్లి సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ అధ్యక్షతన పనులకు శ్రీకారం చుట్టారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు సహకారంతో ఈ నిధులు సమకూరినట్లు నాయకులు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

**ప్రజలకు మెరుగైన రాకపోకలు**

మల్లన్నపల్లి గ్రామంలో రహదారి సౌకర్యం మెరుగుపరచాలన్న ప్రజల అవసరాన్ని గుర్తించి సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు నాయకులు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో బురద, గుంతల సమస్యలు తగ్గి గ్రామస్తులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని అన్నారు.గ్రామాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి నిధులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

**నాణ్యతా ప్రమాణాలతో పనులు**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని నాయకులు తెలిపారు. మంజూరైన నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. గ్రామస్తులు తమ సమస్యలను స్థానిక నాయకుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలోని ఇతర సమస్యలను కూడా పరిష్కరించేందుకు నాయకులు చొరవ చూపాలని కోరారు.

**భారీగా పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు**

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, సర్పంచ్ పసునూటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ కనుకుల తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎక్కటి సంజీవరెడ్డి, అన్నం ప్రవీణ్, పెద్ది శివకుమార్, కనుమల్ల సంపత్, బెల్లపు ఐలయ్య, మూడెత్తుల మల్లేష్, లాల్ మహ్మద్, అన్వేష్, గంధం రవీందర్, వేముల ప్రవీణ్ రెడ్డి, మోత్కూరి రాజు, ఎండి అక్బర్ బాషా, పెరుమల్ల శ్రీనివాస్, తాళ్లపెల్లి సారయ్య, కంచర్ల రవి, మడిపల్లి కుమార్, పంచాయతీరాజ్ ఏఈ, గ్రామ కార్యదర్శి బండారి మహేందర్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు

# రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి నివాళులు అర్పించినకాంగ్రెస్ నాయకులు

**వేములవాడ,సెప్టెంబర్,02:ప్రజాజ్యోతి.**

వేములవాడపట్టణంబుధవారం రోజునస్వర్గీయదివంగతఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వైయస్ రాజ శేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సంద ర్భంగా వేములవాడ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులోవైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి కాంగ్రెస్ నాయ కులు ఘనంగా నివాళులు అ ర్పించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, రొండి. రాజు, కౌన్సిలర్, లుతోట. రాజు, కొక్కుల.రాజు, కాంగ్రెస్ సీనియర్ నా యకులు చిలుక రమేశ్, నిత్య నందరావు,సిర్రం ప్రసాద్ యాద వ్,కాంగ్రెస్నాయకులుపాలుగోన్నారు.



# ఎంసిఆర్ హెచ్ఆర్డి లో మహిళా సర్పంచుల మూడు రోజుల శిక్షణ ముగింపు

## - గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం

## - చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

## - శిక్షణ అనంతరం ప్రశంసా పత్రాలు అందుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచులు

**కోనరావుపేట, ఆగస్టు.02(ప్రజా జ్యోతి)**

హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిఆర్ హెచ్ఆర్ డిఐటి) ఆధ్వర్యంలో ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల (సర్పంచులు) కొరకు నిర్వహించిన మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కోనరావుపేట మండలం బావుసాయిపేట సర్పంచ్ షేక్ యాస్మిన్ పాషా, వేములవాడ రూరల్ మండలం అనుపురం సర్పంచ్ శేర్ల రాజేశ్వరి, చంద్రగిరి సర్పంచ్ ముత్త సంజన, అలాగే ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లె సర్పంచ్ సునీత తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 2 వరకు మూడు రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణా తరగతులలో గ్రామ పంచాయతీల పరిపాలన, స్థానిక అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నిధుల వినియోగం మరియు గ్రామీణాభివృద్ధిలో మహిళా ప్రజాప్రతినిధుల పాత్రపై నిపుణులు విస్తృతమైన అవగాహన కల్పించారు.శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం సర్పంచులు నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకని అభినందనలు పొందారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ... స్థానిక సంస్థల పరిపాలనలో మహిళలకు భాగస్వామ్యం పెరగాలని, స్థానిక సంస్థలతో పాటు చట్టసభల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. మహిళలు పరిపాలనా రంగంలోకి వస్తే అవినీతి రహిత, సుపరిపాలన అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.(ఎంసిఆర్ హెచ్ఆర్డి) సంస్థలో పొందిన ఈ శిక్షణ ద్వారా గ్రామ పంచాయతీల స్వయం సమృద్ధి, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై స్పష్టమైన అవగాహన వచ్చిందని వారు హర్షం వ్యక్తం చేశారు.తాము ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామాల సమిష్టి అభివృద్ధికి రాబోయే రోజుల్లో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సర్పంచులు స్పష్టం



చేశారు. సీసీ రోడ్ల నిర్మాణం, మురుగునీటి పారుదల, పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి ప్రాథమిక సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాభివృద్ధి అనేది ఒక్కరితో సాధ్యమయ్యేది కాదని, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందితో పాటు ప్రతి ఒక్క గ్రామ ప్రజలు భాగస్వాములై సహకరించాలని కోరారు. ప్రజా సహకారంతోనే గ్రామాలను సమగ్ర అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగలమని ఈ సందర్భంగా సర్పంచులు పిలుపునిచ్చారు.



# బావిలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

## - తప్పిన భారీ పెను ప్రమాదం

## - ప్రమాద సమయంలో బస్సులో 52 మంది ప్రయాణికులు

**చిగురుమామిడి/సెప్టెంబర్ 02, ప్రజా జ్యోతి,**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గురువారం సుందరగిరి గ్రామ శివారులో హుస్నాబాద్ డిపోకు చెందిన ఏపీ29 జెడ్ 2426 ఆర్టీసీ బస్సు,స్టీరింగ్ రాడ్ విరగడంతో బస్సు అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. రహదారి పక్కనే ఉన్న స్థానిక రైతు కవాటీ బక్కయ్య చెందిన వ్యవసాయ బావిలోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు ప్రమాద సమయంలో ప్రయాణికులు 52 మంది ఉన్నారు.బస్సులో ప్రయాణిస్తున్న 12 మంది ప్రయాణికులకు గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఘటనా స్థలానికి హుటాహుటిన స్థానిక ఎస్సై జగదీశ్వర్, తహసిల్దార్ కనకయ్య చేరుకొని, గాయపడిన వారిని 108 వాహనంలో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# పద్య పఠనంతో భాషపై పట్టు పెరుగుతుంది :ఎంఈఓ శ్రీనివాస్

## - జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



**కొడిమ్యాల, సెప్టెంబరు 2,(ప్రజాజ్యోతి):**

విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు పద్య పఠన పోటీలు దోహదపడతాయని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జగిత్యాల జిల్లా తెలుగు భాషా ఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి పద్య పఠన పోటీలు నిర్వహించారు.వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. నీతి పద్యాలను పఠించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.పోటీలకు కవి నాగభూషణం చారి, రామాచారి పండితులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. విజేతలు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పద్య పఠన పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర, సీనియర్ తెలుగు భాషా ఉపాధ్యాయులు వెంకట రమణ,అనిత,శేఖర్,సుమన్, అంజయ్య, సరోజన తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సాధికారతకు కంప్యూటర్ శిక్షణ - మహిళలకు ఉపాధికి బాట

**ధర్మారం, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి న్యూస్):**

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ధర్మారం మండల కేంద్రంలో మహిళలకు ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలు,కిశోర బాలికలు ఉచిత కంప్యూటర్ శిక్షణను





సద్వినియోగం చేసుకోవాలని ధర్మారం తహశీల్దార్ దుర్వేటి శ్రీనివాస్ కోరారు.బేటీ బచావోబేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గ్యాడ్ సొల్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో ధర్మారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు నెలల ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను బుధవారంఆయన ప్రారంభించారు. కంప్యూటర్ నైపుణ్యంతో మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చున్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ... గ్యాంగ్ సొల్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ శిక్షణ తరగతులు గ్రామీణ మహిళలకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ విచ్చే అవకాశాన్ని సౌజన్య యోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ బ్లాండినా, నిర్వాహకులు సతీష్, శిక్షకులు జి.అరవింద్, ఎస్.రజిత,కె.ప్రభావతి పాల్గొన్నారు.

## అల్బాస్ పూర్ లో పూరి గుడిసె దగ్ధం..... బాధితులను పరామర్శించే కాంగ్రెస్ నేతలు

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్పూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మల్లారపు పోచయ్య కు చెందిన పూరిగుడిసె బుధవారము మధ్యాహ్నము ప్రమాదవశాత్తు కాలిపోయినదని కుటుంబం పూరి గుడిసె దగ్ధం కావడంతో కుటుంబంలో విషాదం నెలకొన్నది ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచి ఉపసర్పంచి నాగేల్లి వెంకటరెడ్డి గొర్రె అనిల్ వెంటనే స్పందించి ప్రభుత్వ అధికారులకు తెలియజేశారు ఈ విషయం తెలుసుకుని మండల కాంగ్రెస్ సర్పంచ్ పోరం అధ్యక్షుడు  దొమ్మాటి నరసయ్య ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం నుంచి తగిన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని నాయకులు కోరారు ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల పోరం కన్వీన సర్పంచుల పోరం కన్వీనర్ దొమ్మాట నరసయ్య గంటాబుచ్చాగౌడ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాట్ వెంకట్ రెడ్డి పవన్ రెడ్డి తదితరులు పరిశీలించారు.



## ధర్మారంలో అనారోగ్య సమస్యలతో వృద్ధురాలు ఆత్మహత్య

### - కేసు నమోదు చేసిన ఎస్ఐ బి రామ్మోహన్

**కోనరావుపేట, ఆగస్టు.02(ప్రజాజ్యోతి)**

ఆనారోగ్య సమస్యలతో, బాధపడుతున్న  ఓ వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బుధవారం జరిగింది . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వంగపల్లి రాజవ్వ (80)భర్త రాజయ్య, గత కొంతకాలంగా వివిధ ఆనారోగ్య సమస్యలతో పాటు ఒంటరితనంతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తీవ్ర మనస్తాపానికి గురై, ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది .మృతురాలి కుమారుడు వంగపల్లి వెంకటి ,ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు కొనరావుపేట ఎస్సై బి రామ్మోహన్, తెలిపారు.



## నడిరోడ్డుపై దారుణ హత్య

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 2(ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని పదరా గ్రామంలో భార్య పల్లపు జ్యోతి( రజిత )ని కత్తితో పొడిచి చంపిన భర్త  పల్లపు సురేష్ భార్య గొంతు కడుపు చేతులపై విచక్షణ రైతంగా పొడికి హతమార్చిన సంఘటన దాడిని అడ్డుకోబోయిన అత్తా గండికోట ఎల్లవకు కూడా కత్తితోదాడితో తీవ్ర గాయపడిన వృద్ధురాలను సిరిసిల్ల ఆసుపత్రికి 108 లో తరలింపు ఈనంతటికి కుటుంబ కలహాలే కారణమని హత్యకు దారి చూస్తున్నట్టు అనుమానం ఈ సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు చేపిస్తూ వివరాలు తెలియాల్సి ఉంది.



## గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి :ఎంపీడీఓ స్వరూప

### - గౌరాపూర్,నర్సింహులపల్లిలో గ్రామసభలు

**కొడిమ్యాల, సెప్టెంబరు 2,(ప్రజాజ్యోతి):**

విబి-జి రామ్ జి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గౌరాపూర్, నర్సింహులపల్లి గ్రామాల్లో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక రూపకల్పన కోసం బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ఎంపీడీవో స్వరూప హాజరై 202627 సంవత్సరానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరించారు. నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి, విపత్తు నిర్వహణ తదితర రంగాలకు సంబంధించి 318 రకాల పనులను వివరించారు. గ్రామ అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో కనీసం 100 మంది ఉపాధి కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ పాలకవర్గానికి సూచించారు.మొదటి గ్రామసభలో గుర్తించిన పనులకు రెండో గ్రామసభలో ఆమోదం తీసుకుని మండల పరిషత్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, ప్రజలు చర్చించారు. కార్యక్రమంలో గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల హామీలు ఏమయ్యాయి?

## - కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ మహాధర్నా
## - 160 మీటర్ల భారీ ఫ్లెక్సీతో జాతీయ రహదారిపై నిరసన
## - భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు







**కోరుట్ల,సెప్టెంబర్ 02 ప్రజాజ్యోతి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కోరుట్ల పట్టణంలో మహాధర్నా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌వరంగల్ జాతీయ రహదారిపై భారీ ఫ్లెక్సీతో ప్రదర్శన చేపట్టి ప్రభుత్వ తీరును నిరసించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలనే ఉద్దేశంతో 160 మీటర్ల భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

**- హామీల అమలుకు డిమాండ్**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను ఒక్కొక్కటిగా గుర్తు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహాధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ రహదారిపై భారీ ఫ్లెక్సీతో నిర్వహించిన నిరసన కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.



# ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూలు పంపిణీ

**ధర్మారం, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి న్యూస్):**

మండలంలోని కొత్తూరు ప్రాథమిక ఉన్నత పాఠశాల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన షూలను గ్రామ సర్పంచ్ భూక్య సంగీత ఆంజనేయులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సామల నాగభూషణం, హెచ్ఎంలు కే.సత్యం, ప్రసన్నకుమారి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జువ్వాడి భవన్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు

## - పేదల పెన్నిధిగా వైఎస్సార్‌ది చిరస్మరణీయ పాలన

## - వైఎస్సార్ మరణం కాంగ్రెస్‌కే కాదు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీరని లోటు జువ్వాడి కృష్ణారావు





**కోరుట్ల, సెప్టెంబర్ 2 ప్రజాజ్యోతి**

దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కోరుట్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు స్వగృహమైన జువ్వాడి భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌తో కలిసి జువ్వాడి కృష్ణారావు పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల పెన్నిధి అని, వారి అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహానేత అని కొనియాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో తమకు ప్రత్యేకమైన అనుబంధం ఉండేదని ఆయన గుర్తు చేసుకున్నారు. నిరంతరం పేద ప్రజల శ్రేయస్సు, రైతుల సంక్షేమం గురించే ఆలోచించే నాయకుడిగా వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.
వైఎస్సార్‌ను కోల్పోవడం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాదు.. యావత్ తెలుగు ప్రజలకు తీరని లోటు అని జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన పనితీరుతో దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారని తెలిపారు.

### - ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు పాదయాత్ర

వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రను ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు గుర్తుచేశారు. వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ ప్రజలను కలుసుకుని, రైతులు, పేదలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని అన్నారు. ప్రజల కష్టాలను చూసి చలించిపోయిన వైఎస్సార్.. అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎంతో నిజాయితీతో కృషి చేశారని పేర్కొన్నారు.

### - పేదలకు కార్పొరేట్ వైద్యం అందించిన ఆరోగ్యశ్రీ

పేదలకు కార్పొరేట్ వైద్యం ఒక కలగా ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ఆ కలను నిజం చేసిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందని జువ్వాడి కృష్ణారావు అన్నారు. అదే విధంగా ఉన్నత విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. నిరుపేద ముస్లిం యువతకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించేందుకు వైఎస్సార్ తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమని అన్నారు. వృద్ధులు, నిరుపేదలకు పెన్షన్లు అందిస్తూ వారి జీవితాల్లో భరోసా నింపారని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేశారని తెలిపారు.

### - రైతుల సంక్షేమమే లక్ష్యంగా జలయజ్ఞం

దేశానికి వ్యవసాయమే వెన్నెముక అని బలంగా విశ్వసించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి జలయజ్ఞం ప్రారంభించారని జువ్వాడి కృష్ణారావు అన్నారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని వారికి అండగా నిలిచారని, రైతు రుణమాఫీ వంటి నిర్ణయాలతో లక్షలాది రైతు కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు.


### - ప్రజా సంక్షేమంలో చెరగని ముద్ర

2004 మే నెలలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన పాలనలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని జువ్వాడి కృష్ణారావు తెలిపారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, రైతులకు ఉచిత విద్యుత్, 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, ట్రిపుల్ ఐటీలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలను ఆయన పాలనలో అమలు చేశారని గుర్తుచేశారు. ప్రజల కోసం పనిచేసిన నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని, ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు గుర్తుండిపోయాయని జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, జగిత్యాల జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎం.ఎ. నయీమ్, కౌన్సిలర్ తోట గంగాధర్, కోఆప్షన్ సభ్యులు బొద్దూరి సతీష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పుప్పాల ప్రభాకర్, ఆర్. భూమయ్య, ఎలిశెట్టి భూమారెడ్డి, రిజ్వాన్ పాషా, ఎంబేరి నారాయణ, చిట్‌మెల్లి రంజిత్, గుప్తా శేఖర్ రెడ్డి, నజ్జు, లింబాద్రి, ఓలెపు రాజేష్ తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు పొడిగింపు

**కొడిమ్యాల, సెప్టెంబరు 2,(ప్రజాజ్యోతి):**

చేయూత పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. వితంతువు, ఒంటరి మహిళ, గీత కార్మికులు, చేనేత కార్మికులు, వికలాంగులు, డయాలసిస్, తలసేమియా, సికిల్‌సెల్, హీమోఫీలియా, బోదకాలు తదితర పింఛన్లకు అర్హులైన వారు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.





# వైఎస్సార్‌కు కాంగ్రెస్ నేతల ఘన నివాళి

**కొడిమ్యాల, సెప్టెంబరు 2,(ప్రజాజ్యోతి):**

మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్‌రెడ్డి,సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి,నాయకులు ముత్యం శంకర్,కొండూరి రాజేష్,గాజుల అజయ్,గోల్కొండ రాజు,జలంధర్,అజయ్‌రెడ్డి,మ్యాకల మల్లేశం, పాపిరెడ్డి,లక్ష్మారెడ్డి,నర్సయ్య,నజీర్,శంకర్,స్వామి,రాజమల్లు,కవ్వం మధు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# 'ఇందిరమ్మ కుట్టు మెషీన్'కు దరఖాస్తులు

**కొడిమ్యాల, సెప్టెంబరు 2,(ప్రజాజ్యోతి):**

పేద బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మెషీన్' పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. అర్హులైన మహిళలు సెప్టెంబరు 15లోగా టీజీఓబిఎంఎంఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు అనంతరం ప్రతులను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. బీసీ వర్గాలకు చెందిన పేద మహిళల్లో వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులకు తెల్ల రేషన్‌కార్డు, రూ. 1.50 లక్షల లోపు వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉండాలని, వయసు 18 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి ఒక కుట్టు మెషీన్ మాత్రమే అందజేస్తామని, దరఖాస్తుదారుకు కుట్టు పనిలో అనుభవం ఉండాలని తెలిపారు.ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మండల స్థాయి కమిటీ పరిశీలించి అర్హులను ఎంపిక చేసి జిల్లా కమిటీకి పంపుతుందని, జిల్లా స్థాయిలో ఖరారు చేసిన అర్హుల జాబితా ప్రకారం ఆటోమేటిక్ కుట్టు మెషీన్లు అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

# విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంజయన్న!

## - కల్లూర్ మోడల్ స్కూల్‌కు అదనపు బస్సు మంజూరు
## - విద్యార్థులతో కలిసి స్వయంగా బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే సంజయ్

**కోరుట్ల,సెప్టెంబర్ 02 ప్రజాజ్యోతి**



విద్యార్థుల సమస్య ఏదైనా తన దృష్టికి వస్తే వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మరోసారి నిరూపించారు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కల్లూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న బస్సు సమస్యకు ఎమ్మెల్యే సంజయ్ చొరవతో తక్షణ పరిష్కారం లభించింది.రెండు రోజుల క్రితం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కల్లూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. విద్యార్థుల ఇబ్బందుల విషయం ఎమ్మెల్యే సంజయ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను పరిష్కరించేందుకు ఆర్టీసీ ఆర్‌ఎం, డీఎంలతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి అదనంగా ఒక బస్సును కేటాయించేలా చర్యలు తీసుకున్నారు.

**- మాట ఇచ్చారు.. రెండు రోజుల్లోనే బస్సు తెప్పించారు!**

ఎమ్మెల్యే సంజయ్ చొరవతో ఈరోజు అదనపు బస్సు అందుబాటులోకి వచ్చింది. దీంతో కల్లూరు మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ప్రయాణ సమస్యకు ఊరట లభించింది. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడంతో తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థుల సమస్యను కేవలం అధికారులకు అప్పగించి వదిలేయకుండా ఎమ్మెల్యే సంజయ్ స్వయంగా విద్యార్థులతో కలిసి కోరుట్ల నుంచి కల్లూర్ మోడల్ స్కూల్ వరకు బస్సులో ప్రయాణించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బస్సు సౌకర్యం ఎలా ఉందో స్వయంగా పరిశీలించారు.






**- విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. విద్యార్థుల చదువుకు, వారి ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి అదనపు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే సంజయ్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను తెలుసుకున్న వెంటనే అధికారులతో మాట్లాడి కేవలం రెండు రోజుల్లోనే పరిష్కారం చూపడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

# మరపురాని మహానేత.. జలప్రదాత వైఎస్ఆర్

## - మండల అధ్యక్షుడు కాయితీ నాగరాజు

**కథలాపూర్, సెప్టెంబర్ 2(ప్రజాజ్యోతి):**

మరపురాని మహానేత.. జలప్రదాత వైఎస్ఆర్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితీ నాగరాజు పేర్కొన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి పథకాలతో వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన పాలన రాష్ట్రంలో స్వర్ణయుగమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పీసీసీ తోట్ల అంజయ్య, కాంగ్రెస్ యూత్ నాయకులు సంతోష్, రేహాన్, చౌదరి, రంజిత్, ప్రవీణ్ తదితరులు వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.




# కల్వగడ్డ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం!

## - ఉడకని అన్నం.. మెనూలో కూరగాయల కర్రీ మాయం

## - గుడ్లు వడ్డిస్తున్న పీఈటీ.. అన్నం వడ్డిస్తున్న విద్యార్థులు

## - అపరిశుభ్ర వంటగదితో విద్యార్థుల ఆరోగ్యంపై ఆందోళన

## - పథకం అమలుపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలంటున్న తల్లిదండ్రులు






**కోరుట్ల,సెప్టెంబర్ 02 ప్రజాజ్యోతి**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై కోరుట్ల పట్టణంలోని కల్వగడ్డ ప్రభుత్వ పాఠశాలలో పలు అనుమానాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థులకు అందాల్సిన భోజనంలో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయనే ఆరోపణలు రావడంతో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై చర్చ జరుగుతోంది.

### - మెనూలో కూరగాయల కర్రీ ఎక్కడ?

ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పప్పు, కూరగాయల కర్రీ, కోడిగుడ్డు తదితర పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది. అయితే కల్వగడ్డ ప్రభుత్వ పాఠశాలలో భోజనాన్ని పరిశీలించిన సమయంలో మెనూలో ఉండాల్సిన కూరగాయల కర్రీ కనిపించలేదని విద్యార్థులు, స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారా? లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### - ఉడకని అన్నంతో విద్యార్థుల అవస్థలు

మధ్యాహ్న భోజనంలో భాగంగా అందించిన అన్నం పూర్తిగా ఉడకలేదని, దీంతో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చిన్నారులకు అందించే భోజనం నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ఉడకని అన్నం విద్యార్థులకు వడ్డించడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం విద్యార్థుల కోసం నిధులు కేటాయిస్తూ, పౌష్టికాహారం అందించేందుకు పథకాలను అమలు చేస్తున్న నేపథ్యంలో వాటి అమలు క్షేత్రస్థాయిలో సక్రమంగా జరుగుతుందా లేదా అన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

### - గుడ్లు వడ్డిస్తున్న పీఈటీ.. చర్చనీయాంశంగా మారిన దృశ్యం

మరోవైపు విద్యార్థులకు విద్యాబోధన చేయాల్సిన పీఈటీ గుడ్లు వడ్డిస్తున్న దృశ్యం కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణలో భాగంగా విద్యార్థుల సంక్షేమాన్ని పర్యవేక్షించడం సహజమే అయినప్పటికీ, మధ్యాహ్న భోజనం వడ్డించే బాధ్యతలు ఎలా నిర్వహిస్తున్నారనే దానిపై స్పష్టత అవసరమని పలువురు అంటున్నారు.

### - అన్నం వడ్డిస్తున్న విద్యార్థులు

ఇక చదువుకోవాల్సిన విద్యార్థులే తోటి విద్యార్థులకు అన్నం వడ్డించే పనిలో కనిపించడం కూడా పలు ప్రశ్నలకు తావిస్తోంది. విద్యార్థుల సమయం పూర్తిగా విద్యాభ్యాసం, పాఠశాల కార్యకలాపాలకు వినియోగించాల్సి ఉండగా, వారితో భోజనం వడ్డించే పనులు చేయిస్తున్న పరిస్థితులపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### - అపరిశుభ్రంగా వంటగది.. పరిశుభ్రతపై ప్రశ్నలు

పాఠశాలలోని వంటగది, భోజనం వడ్డించే ప్రదేశాల్లో కూడా పరిశుభ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వంటగది పరిసరాలు శుభ్రతకు దూరంగా ఉన్నట్లు కనిపిస్తుండటంతో, విద్యార్థులకు తయారు చేసే ఆహారం ఏ మేరకు పరిశుభ్రమైన వాతావరణంలో సిద్ధమవుతోంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాల నాణ్యతతో పాటు వంటగది పరిశుభ్రత, తాగునీరు, వంట పాత్రల శుభ్రత తదితర అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యం జరిగితే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### - పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలే ఆధారం

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమత లేని అనేక కుటుంబాల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలే ప్రధాన ఆధారం. విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది.అలాంటి పథకం అమలులో నాణ్యత లోపాలు, మెనూ అమలులో నిర్లక్ష్యం, పరిశుభ్రత లోపాలు చోటుచేసుకుంటే పథకం అసలు లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



### - అధికారులు వెంటనే తనిఖీ చేయాలని డిమాండ్

కల్వగడ్డ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై వస్తున్న ఆరోపణలను విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే పరిశీలించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. పాఠశాలను ప్రత్యక్షంగా తనిఖీ చేసి భోజనం నాణ్యత, మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, విద్యార్థులతో భోజనం వడ్డించే పనులు చేయిస్తున్నారా లేదా వంటి అంశాలపై వాస్తవాలను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండూ కీలకమైన నేపథ్యంలో కల్వగడ్డ ప్రభుత్వ పాఠశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

